



కె. సుమ

వేసవికాలం వేసవే మండు టెండలకు, మామిడిపళ్ళకు, మల్లెపూలకు, ముంజలకు. తాగారం, ఆవకాయలకే కాక విద్యార్థులు ఏటికేడాది చదివిన చదువు పండించుకునే పరీక్షలకు కూడా సీజనే.

విద్యార్థుల సమ్మెలు, ఉపాధ్యాయుల సమ్మెలు, కాకపోతే ఇతర రాజకీయాలు వెరసి పరీక్షలు మార్చి నుంచి ఏప్రిల్‌కి, ఏప్రిల్ నుంచి మేకి, తగులు మిగులు జూన్ దాకా కూడా గెంతాయి.

ఎండవేడికి రోడ్ల మీది తారు కరిగిపోతే ఆ వేడికి, చదువు వేడికి విద్యార్థుల మెదడు కూడా కరిగిపోతున్నట్టు ఉంది. డిగ్రీ పరీక్షలు, ఇంటరు పరీక్షలు హోరాహోరీగా సాగుతున్నాయి. చదివిన వాళ్ళకు జోరు. చదవని వాళ్ళకు జోరు. ప్రశ్నా పత్రాలు ముద్దు పేరుకునే వారికి పొద్దెరుగదు! అప్పరు పేపర్లు వ్రాసుకో వేసి అలాగే మార్కులు వేస్తారనుకునే విద్యార్థులు (విద్యార్థినులు కూడా) పేజీకి పది లైన్లు కూడా వ్రాయకుండా ఎన్ని ఎడిషనల్స్ తీసుకుంటే అంత ఘనత అని గీకేస్తున్నారు. రామనామంతో పేపర్లు నింపే రామదాసులు కొందరు! ఇంటి కష్టాలన్నీ జాలి గొలిపే కథగా వ్రాసి మార్కులు అర్థించే బిచ్చగాళ్ళు కొందరు. మార్కులు వెయ్యకపోతే మీ సంసారం సాగరంలో పడి చస్తారని శాపనార్థాలు పెట్టే సంస్కారులు కొందరు. సినీ తారలంటే పెల్లుబాలిన అభిమానం పేపరు నిండా ప్రదర్శించే అభిమాన సంఘాల సభ్యులు కొందరు. ఇంకెక్కడా అవకాశం దొరకనట్టు ఇండక్ జోకులు వ్రాసే చౌడప్పలు కొందరు. రాకులు, బాకులు అన్నీ కలిపి అందంగా సుప్పి ఆ ఇల్లు సరే మీరు పడుతుంది గ్యారంటీ అని అతి నాజూకుగా చెప్పే సున్నిత హృదయులు కొందరు. ఇన్విజిలేటర్లనే డిక్టేట్ చేయమని పీడించే పిండాలు కొందరు.

ఇక విద్యార్థులు కాపీలే కొడుతున్నారో, కాఫీలే తాగుతున్నారో ఏం పట్టించుకోకుండా ఎదురుగా ఉండే గోడలకు ముక్కు గుద్దుకునేలాగా మాటిమాటికి తిరగటమే తమ ధ్యేయంగా పెట్టుకున్న ఇన్విజిలేటర్లు కొందరైతే, అవతల పరంగా ఉన్న కాస్త శక్తినీ ఇక్కడ ధారపోయ్యాలని పెండ్లి కబురులా కూర్చునే వారు కొందరు. పాత జ్ఞాపకాలను నెమరు వేసుకొని ఆనందించే విన్నాటి తరం వారు కొందరైతే, ఆవిన్యతో



రాతి రథం ఫోటో : ఎస్. సుందర్ బాబు ( నందలూరు )

లోకి తొంగి చూసి తియ్యటి కలలు కనే నేటి తరంవారు కొందరు. మూడు గంటల్లో కనీసం రెండు గంటలు నామం చేసుకుంటే పుణ్యం వస్తుందని పరాన్ని గురించి తలపోసే పుణ్యాత్ములు కొందరైతే, పజిల్స్ సాల్వ్ చేసే వాళ్ళు, పగ సాధించటానికి ప్లాన్లు వేస్తూ ఇహాన్ని బతికే వాళ్ళు కొందరు. కాఫీలు, టీలు, కూల్ డ్రింకులు సిప్ చేస్తూ నిమిషాలు దొర్లించే వాళ్ళు కొందరైతే, ఆ డబ్బెందుకు ఖర్చు చేయాలని ఆదా చేసే వారు కొందరు. ఇలా ఎవరి పనితో వారు మునిగిపోయిన తరుణంలో "అమ్మా! వాళ్ళొస్తున్నారు" అని హెచ్చరిక చేస్తూ వెళ్ళిపోయింది వెంకటమ్మ.

"ఈ వేళ పెద్దమ్మ గారు పోలీసుల్ని వెంట పెట్టుకొని వస్తున్నారు. ఆయమ్మ వెంట ఆరుగురు ఉన్నారమ్మా! కొంచెం జాగ్రత్తమ్మా!" అంటూ మరో హెచ్చరిక చేస్తూ వెళ్ళిపోయాడు మరిడయ్య. కూర్చుని విశ్రాంతి తీసుకుంటున్న వాచర్లు దిగ్గున లేచి కీ ఇచ్చిన బొమ్మలా తిరగటం మొదలుపెట్టారు.

రెండవ నంబరు హాలు దగ్గరికి స్క్వాడ్ కింకరులు వచ్చారు. పెద్దమ్మ గారు వాచర్‌ని చూశారు. కాని ఒక్క క్షణం ఖేదంతో చూసుకోవటం వల్ల చూపులు కలవలేదు. "ఈ హాల్‌లోకి వెళ్ళక్కర్లేదు. మరో హాల్లోకి వెళదాం" అన్నారు. డెప్యూటీ డైరెక్ట్రెస్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్. మిగతా అన్ని హాల్స్ చుట్టబెట్టి స్క్వాడ్ కార్లో ఎగిరిపోయారు ( ఫ్లయింగ్ స్క్వాడ్ కనక ). అంతా హాయిగా వూపిరి పీల్చుకున్నారు ఎక్కడ ఎవర్ని పట్టుకుంటారో, ఎన్ని 'రి' మార్కులు వ్రాసి పోస్తారో అని కాలూ చెయ్యీ ఆడని పరిస్థితిలో ఉన్న చీఫ్‌కి రిలీఫ్ వచ్చింది. అంతా అమ్మ+అయ్య=అమ్మయ్య అనుకున్నార.

"రెండవ నంబరు హాల్‌లోకి వెళ్ళక్కర్లేదు" అని డెప్యూటీ అమ్మగారు ఎందుకన్నారో మాత్రం జవాబు లేని ప్రశ్నగా మిగిలిపోయింది. జవాబు కోసం ఆరాటపడే జగన్నాథం అనుభవంతో తల పండిన అంజయ్యతో చెప్పాడు:

"చూడు, జగ్గూ! ప్రాణం అంటే ఏమిటి? తెలియదు కదా? చస్తే ఆ ప్రాణం ఎక్కడికి పోతుంది? తెలియదు కదూ? నిద్ర అంటే నిర్వచనం? తెలియదు కదా? దయ్యాలు, భూతాలు ఉన్నాయా? తెలియదు కదా? పోనీ, దేవుడు ఉన్నాడా? తెలియదు కదా?

అలా ఎన్నో, ఎన్నో తెలియదుల్లో ఇదొకటి.

డెప్యూటీ గారికి మాత్రమే ఆ ప్రశ్నకు జవాబు తెలుసు. ఆవిడ్ని అడిగే ధైర్యం నీకు ఉందా? నాకు మాత్రం లేదు. ఎందుకొచ్చిన గొడవ గాని, నీ పని నువ్వు చేసుకోవయ్యా."

తల స్టేటస్‌కి లోపం రాకుండా ఎంతో తెలివి తేటల ఉపయోగించి ఆ రోజు హాల్ నంబరు టూలో ఇన్విజిలేట్ చేసిన మిసెస్ కృష్ణవేణి ఇంటి అడ్రెసు డెప్యూటీ అమ్మగారు జాగ్రత్తగా రాబట్టుకున్నట్టు ముక్కంటికి తప్ప మూడవ కంటికి తెలియదు.

* * * *

"మీరు నన్ను గుర్తు పట్టలేదు కదూ?"

"రండి, కూర్చోండి! మీరు... మీరు... పొద్దున్న వచ్చిన ఫ్లయింగ్ స్క్వాడ్.., అంటే మీరు డెప్యూటీ డైరెక్ట్రెస్ కదండీ?

మీరు మా హాల్‌కి రాకుండానే వెళ్ళిపోయారు. నాకు మిమ్మల్ని విష్ చేసే అవకాశం మీరు ఇవ్వలేదు."

"అంటే మీరు నన్ను నిజంగా గుర్తు పట లేదన్న మాట! ఇరవై ఏళ్ళ క్రితం నేను మన కాలేజీ పాత విద్యార్థిని. పాత లెక్చరర్లెవ్వరూ లేరే! అంతా రిటైరై పోయారా, మేడమ్?"

"అవునండీ! నేను కూడా ఈ సంవత్సరం చివర్లో రిటైరవుతున్నాను."

"నన్ను 'అండీ' అని మన్నిస్తున్నారేమిటండీ! మీరు పెద్దవారు. నన్ను 'నువ్వు' అంటేనే బాగుంటుంది, మేడమ్."

"అట్లాగే! ఇంతకీ నీ పేరు జ్ఞాపకం రావటం లేదమ్మా."

"వసుధ."


"నువ్వు సైన్స్ స్టూడెంట్‌వా? నేను నీకు టీచ్ చేశానా?"

"కాదండీ. నేను ఎమ్. ఎ., ఎమ్. ఇడి.ని. మన కాలేజీలో ఇంటర్ ఆర్ట్స్ గ్రూప్‌తో చదివానండీ."

"మరి నేను సైన్స్ లెక్చరర్ని కదా? నేనెలా తెలుసు నీకు?"

"ఒక్క పరీక్షకి — నాకు బాగా జ్ఞాపకం ఉంది— ఎకనమిక్స్ పరీక్షకి మా రూమ్‌కి— అంటే రెండవ నంబరు రూమ్‌కి — మీరు ఇన్విజిలేటర్‌గా వచ్చారు. అంతకు తప్ప మరే

నేనంతకీ చెప్పానుగదా.. వాడొట్టి తలతిక్క వెధవ. వాడ్ని షాక్ ఖరింపటానికి పిలవొద్దురా అని.. ఇప్పుడు చూడు!!



విధంగానూ నాకు తెలియదు. ఆ రోజు తరవాత మిమ్మల్నెప్పుడూ మళ్ళీ చూడలేదండీ.''

"అలాగా? నాకు జ్ఞాపకం లేదమ్మా."

"అది సహజమే కదండీ! వందల సంఖ్యలో విద్యార్థులు ప్రతి ఏడూ ఈ కాలేజీ నుంచి వెళ్ళిపోతారు. అదీ ఇరవై సంవత్సరాల క్రితం. అందులోనూ మీన సబ్జక్ట్సు వేరు కదండీ?''

"ఒక్క నిమిషం కూర్చో, అమ్మా! రాక రాక వచ్చావు. కాస్త టిఫిన్ తీసుకుని వెడుదువు గాని."

"అట్లాగేనండి."

* * *

వసుధ మనస్సు గతంలోకి పరుగెత్తింది. తను ఇంటర్ రెండవ సంవత్సరం పరీక్ష వ్రాస్తూంది. అదే రూమ్ నంబర్ టూ! అందులో తను ఎకనమిక్స్ పరీక్ష వ్రాస్తూంది. అదే రూమ్! మరిచిపోదామన్నా మరపురాని సువిశాలమైన గది. గదిలో ఒక మూల తన సీటు. తనెప్పుడూ మాట్లాడని పరిచయం లేని ఆమె ఇన్విజిలేటర్‌గా వచ్చింది. ఆమే కృష్ణవేణి మేడమ్. పరీక్ష మొదలయింది. మూడు గంటల్లో రెండు గంటల వరకూ ఫరవాలేదు. బాగానే వ్రాసింది. ఇంతలో పక్క వరసలో ఉన్న ఒక అమ్మాయి దగ్గరి నుంచి ఆమె ఒక స్లిప్ తీసుకుంది. ఎవ్వరికీ వినపడకుండా అమ్మాయికి మాత్రమే వినపడేటట్టు మెత్త మెత్తగా చివాట్లు వేసి ఆ చీటీ లాక్కుని తన పర్సులో వేసుకుంది. ఇదంతా గమనిస్తున్న తనలో సన్నని వణుకు ప్రారంభమైంది.

"అందులోది నేనేం వ్రాయలేదండీ!" ఆ అమ్మాయి సమర్థించుకుంది.


"సరే! కాలం వృథా చెయ్యక పరీక్ష వ్రాయి" చాలా చిన్న గొంతుతో అని అక్కణ్ణించి వెళ్ళిపోయింది కృష్ణవేణి మేడమ్.

మెత్తటి మనిషి లాగే ఉంది. తనే డిబార్ చేయించగల పవర్స్ ఉండి కూడా చీటీమాత్రం తీసుకొని వెళ్ళిపోయింది. తనలో బయలుదేరిన వణుకు సన్నగిల్లింది. మెల్లగా ధైర్యం చోటు చేసుకుంది. మేడమ్ కూర్చుని ఏదో వ్రాసుకుంటూంది. ఇప్పట్లో లేచేటట్టుగా లేదు. తనలో ప్రవేశించిన ధైర్యం గైడ్‌లోంచి చింపి తనతో పాటు అందరి కళ్ళలో కారం కొట్టి తెచ్చుకున్న ఒక కాగితాన్ని బయటికి లాగి ఆన్సరు పేపర్ల మధ్య పెట్టుకునేటట్టు చేసింది.

'పక్క పిల్లనడిగితే నాళ్ళేటూ చెప్పరు. పైగా హాల్‌లో అందరి ఎదురుగా నాచర్ చీవాట్లేస్తుంది. ఇదే మంచి పద్ధతి." మనస్సులోనే సమాధాన పడింది.

"హౌఎవర్ మోర్! పరీక్ష వ్రాయటం పూర్తి అయిన వాళ్ళు హాల్ టికెట్ నంబర్ చెక్ చేసుకొని వెళ్ళ వచ్చమ్మా!"

మేడమ్ గొంతు మరీ గట్టిగా కాకుండా మరీ మెల్లగా కాకుండా పలికింది. చాలామంది లేచి వెళ్ళిపోయారు. ఆమె పేపర్లు కలెక్ట్ చేస్తూంది. అంతే—భయంకరమైన క్షణం రానే వచ్చింది.



నదిఒడ్డున .,. ఫోటో—డాక్టర్ ప్రేమ్‌చక్రధర్‌గోస్వామి ( జైపూర్ )

"ఏమమ్మా! ఆ కాగితం ఇలా ఇచ్చెయ్"

తనివ్వలేదు సరి కదా దాని మీద అరచెయ్యి పెట్టింది. మేడమ్. ఆన్సర్ పేపరు మొత్తం లాగేయటంతో ఆ కాగితం కింద పడటం, ఆమె ఆ కాగితం తీసి రెండు మడతలు పెట్టి తన పర్సులో వేసుకోవటం క్షణంలో జరిగిపోయింది.

"మేడమ్! సారీ, మేడమ్!" గొంతు బొంగురుపోతుంటే ఎలాగో అలా అనగలిగింది.

"ఫరవాలేదమ్మా! ఇంక ఇరవై నిమిషాలే ఉన్నాయి. త్వరగా వ్రాయి."

"నే నందులోది ఒక్క వాక్యం కూడా వ్రాయలేదు, మేడమ్." గద్గదం ఎక్కువైంది.


"ఫరవా లేదన్నానుగా? నాకు తెలుసు. నువ్వందులో దేమీ వ్రాయలేదని నే నందర్నీ జాగ్రత్తగా వాచ్ చేస్తున్నాను. నేనున్న రూమ్‌లో కాపీ జరగదు." గర్వంతో కాకుండా ఆత్మ స్థైర్యంతో అన్న మాటలు తక్కువ స్థాయి గొంతునుంచి తియ్యగా వెలువడ్డాయి. కాని, తనివేం పట్టించుకునే దశలో లేదు. తన ధ్యేయం ఒక్కటే.

"నా కా పేపరు ఇస్తే ఆ కాస్త వ్రాసేస్తానండీ! ఈ రూమ్‌లో ఇంకెవ్వరూ లేరండీ! దయచేసి ఆ పేపరు ఇవ్వండీ. నేను పేపరు బాగా వ్రాయలేక పోయానండీ!! ప్లీజ్" వస్తున్న వణుకును ఎలాగో నొక్కి పెట్టి అనగలిగింది.

"వాట్! ఆ పేపరు ఇవ్వాలా? అలా ఎప్పటికీ జరగదు." నిశ్చలంగా అంది. "ఇవ్వకూడదమ్మా! నీకెంత వస్తే అంతే వ్రాయి." ఒప్పించే ధోరణిలో అంది.

"ప్లీజ్ మేడమ్! టైమ్ అయిపోతూందండీ! ఆ పేప రివ్వండీ." ఆ మెత్తటి మేడమ్ ఇంకొక్కసారి అడిగితే ఇచ్చేస్తుందన్న ఆశతో అడిగింది.

"చూడమ్మా! బాగా చదువుకుని రావాలి కాని, కాపీ కొట్టకూడదు. నువ్వు చేసే పని తప్పని ఒక్కసారి



చెపితే అర్థం చేసుకుని తప్పనిసరి అయిన పరిస్థితిలో కూడా తప్పు చేయకుండా ఉండాలి. మూడేళ్ళు డిబార్ కానీయకుండా కాపాడాను. ఇంతకీ నే నిక్కడ ఉన్నది ఎందుకు? మీరు కాపీ కొట్టకుండా చూడటానికేగా? ఇటీజ మై డ్యూటీ. ఆయామ్ పెయిడ్ ఫర్ ఇట్. నీ కొచ్చిం దేదో వ్రాయి. లేకపోతే పేప రిచ్చేయ్!" కాస్తకూడా గొంతు పెంచకుండా అనేసి వెళ్ళిపోయింది ఆమె.

తను కసిగా, కోపంగా ఆమె వంక చూసింది. 'లంఖిణి, రాక్షసి, దయా దాక్షిణ్యాలు లేని కరుకు కసాయి. ఇంత బతిమాలుతూంటే మరొకరైతే ఇవ్వరూ? ఈమే దాపురించాలా తనకి? ఛీ! ఏం మనిషి! వెధవది! ఒక్క చీటీముక్క ఇస్తే ఈవిడ సొమ్మంతా పోయినట్లు ఏడుస్తూంది. తనకి పిల్ల ల్లేరూ? వాళ్ళు రేపు పైకి రావద్దూ?' శాపనార్థాలు పెట్టింది. ఈ లోపలే టైము అయి పోయింది. అలారం బెల్ మోగింది. ఆవిడ పైకి మెత్తగా మాట్లాడే బండరాయి! తన ప్రమేయం లేకుండానే పేపర్ తీసుకుని వెళ్ళిపోయింది.

పరీక్షలైపోయినాయి. ఆ రోజు నిద్ర పోయిన నిజాయితీ ఆ తరవాత మేల్కొంది. తను బతిమాలిన తీరు తలుచుకుంటే తనకే అసహ్యం వేస్తూంది. ఏదో పది లైన్లు అప్పరు పేపరుమీద పెట్టాలనే ఆదుర్దాలో ఆ గైడు పేపరు అడిగింది. కాని అది తప్పని తనకూ తెలుసు. తనను డిబార్ చేయించ నందుకు ఆమెకు మనస్సులో కృతజ్ఞతలు చెప్పుకుంది.

కళ్ళు మూసుకుని ఆమె పాదాలను ఊహించుకుని సాష్టాంగపడింది. శాపనార్థాలు పెట్టినందుకు లెంపలు వాయించుకుంది. తిట్టినందుకు క్షమించ మని అడిగింది.

"తప్పు చేయటం మానవ నైజం. దిద్దుకోవటం దైవత్వం. ఆ దిద్దుకోవటానికి అవకాశం ఇచ్చిన మేడమ్ కృష్ణవేణి దేవత! నిజంగా దేవత! ప్రతి మనిషికి ఒక్కసారైనా చేదు అనుభవం ఉంటుంది కాబోలు! నేనూ దీనికి మినహాయింపుని కాను."

కాల ప్రవాహంలో కాలెండర్లు కొట్టుకు పోతు న్నాయి. మరెన్నడూ కాపీ జోలికి పోలేదు. కష్టపడి చదివింది. బి.ఎ. ఎమ్.ఎ. బి.ఇడి., ఎమ్.ఇడి. వరసగా పాసయింది. గవర్నమెంటు ఉద్యోగం సునాయాసంగా వచ్చింది. తనఫస్ట్ క్లాస్‌లను చూసి, గోల్డ్ మెడల్స్‌కి పరవశించి ప్రమోషన్లు వరసగా వరించాయి. డెప్యూటీ డైరెక్టర్ అయింది.

రేపో మాపో డైరెక్టర్‌కూడా కావచ్చు.

ఇరవై ఏళ్ళ క్రితం తను చేయబోయిన తప్పును ఇప్పుడు తన తరవాతి తరం వారు చేస్తున్నారేమో గమనించటానికీ, తన తరం వారు, తన పై తరం వారు వాళ్ళని జాగ్రత్తగా గమనిస్తున్నారో లేదో గమనించడానికీ తను అధికార హోదాలో వచ్చింది. ఐరనీ ఆఫ్ నేచర్ అంటే ఇదే కదా! మనస్సు బాధతో మూలిగింది.

ఆ నాడు—ఆ నాడు—తను డిబార్ అయి ఉంటే తన జీవితంలో ఎంత పెద్ద మాయని మచ్చ ఏర్పడేది! తన వాళ్ళలో, సంఘంలో ఎంత అప్రతిష్ఠ! ఎక్కడ ఉండేది తన పరువు! అంత పెద్ద ఆఫీసరు తనను ... చేసుకునేవాడా? తన పిల్లలు ... ఎవరి ద్వారానో వాళ్ళకి తెలిస్తే "అమ్మా! నువ్వు కాపీ కొట్టావా? డిబార్ అయ్యావా?" అని వాళ్ళడిగితే ఏమని జవాబు చెప్పేది? ఎంత కుంచించుకు పోయేది? ఎంత హేయమైన బతుకు తప్పింది, భగవాన్!

స్క్వాడ్ చూడలేదు. చూసిన మేడమ్ క్షమించింది. కాపీ పేప రిమ్మని పదే పదే అడిగి విసిగించినా రెక్క పట్టుకుని చీఫ్ దగ్గిరికి లాక్కెళ్ళలేదు. ఎంత సహనం! ఎంత శాంతం! ఎంత చిన్న గొంతులో అది తప్పని నచ్చచెప్పింది! మరొకరైతే అరిచి పెడబొబ్బలు పెట్టేవారు. తిట్టి అసహ్యించుకునే వారు. మూడేళ్ళు డిబార్ చేయించేవారు. ముఖం మీద ముద్ర కొట్టి మరీ వదిలి పెట్టేవారు. ఆ బాధ తను తట్టుకోలేక, ఆ అవమానం భరించలేక ఆత్మహత్య చేసుకునే దేమో? అలా తన విలువైన జీవితం ముగిసి ఉండే దేమో? ఇంక ఆలోచించలేక పోయింది.

"టిఫిన్ తీసుకో, అమ్మా! ఏమిటో ఆలో చిస్తున్నావు. వీక్లీయో, ఫెమినాయో పేపరో చూస్తూంటా వనుకున్నాను." కృష్ణవేణి మేడమ్ ఎప్పుడు వచ్చారో తను చూడనే లేదు. ఒక్క క్షణం ఏం మాట్లాడ లేకపోయింది.

ఇరవై ఏళ్ళ వయసు వచ్చిన సంఘటన కృతజ్ఞత తంగరించిన బాధను మోసుకొచ్చిందని, అది మూగ బాధ అని ఎలా చెప్పగలదు? మీరు నన్ను డిబార్ చేయించకుండా పరువు నిలిపారనీ, సొసైటీలో పెద్ద స్టేటస్ వెనక నల్ల మచ్చ లేకుండా రక్షించా రనీ, ఒక పాపపు పని నుంచి కాపాడారనీ ఎలా చెప్ప గలదు? ఆత్మాభిమానం అడ్డు వచ్చింది.

"ఏం లేదండి! పొద్దుటి నుంచీ హెవీ వర్క్‌తో అలసటగా ఉంది. ఏం చదవ బుద్ధి కాలేదు."

టిఫిన్లు, డ్రింకులు పూర్తయ్యాయి.

"మేడమ్! ఇంక వెళ్ళొస్తానండీ అర్జెంటుగా చూడవలసిన ఫైల్స్ కొన్ని ఉన్నాయి. మీరు నిరాక రించరనే ఆశతో ఒక చిన్న కానుక తెచ్చాను. దయచేసి వద్దనకుండా తీసుకోండి. తీసుకుంటారు కదూ?" మనఃస్ఫూర్తిగా అర్పించింది.

పట్టుచీర, జాకెట్టు చూసి నిర్ఘాంతపోయింది మిసెస్ కృష్ణవేణి. ఆమె కాళ్ళకు దండం పెట్టాలన్న బలమైన కోరికను బలవంతంగా అణచుకుని కృతజ్ఞత నింపుకున్న కళ్ళతో తదేకంగా ఒక్క క్షణం మేడమ్‌ను చూసి కారెక్కింది వసుధ.

'ఆ సంఘటన గుర్తు లేదు మేడమ్‌కి.'

వసుధ ముఖంలో తృప్తి మిగిలింది.

'ఆ సంఘటన మరిచి పోలేదు ఈ అమ్మాయి.' మేడమ్ మస్తిష్కంలో గతం మెదిలింది. ★

హంపి శిథిలం

ఫోటో : ఎస్. సుందర్‌బాబు ( వరదలవారు )

